# నేనే ఆ ప్రజని - నేనే ఆ 'ప్రజా రాశి'ని

**కార్ల్ శాండ్‌బర్గ్** అనువాదం : **కెఆర్‌బి**

**అవును** – నేను ఆ 'ప్రజ'ని
నేనే మీరనే 'మంద'ని
నేనే ఆ 'గుంపు'ని, నేనే ప్రజారాశిని.
మీకు తెలుసా!
ఈ జగత్తులోని మహత్తర కార్యాలన్నీ
మా వల్లనే సుసాధ్యమైనాయని?!
నేనే శ్రామికుడిని, నేనే నూతన సృష్టికర్తను,
ప్రపంచం మొత్తానికి తిండినీ, బట్టనీ
తయారు చేసేది నేనే!
చరిత్రకు సాక్షిగా నిలిచే శ్రోతను నేనే!
మా నుంచే ఉద్భవిస్తారు
నెపోలియన్లూ, లింకన్లూ!
వారు మరణిస్తే
మరింతమంది నెపోలియన్లూ,
లింకన్లను తయారుచేస్తాను!
నేనే సుక్షేత్రాన్ని!
దున్నడానికి అనువైన పచ్చికబీడును నేను
భీకరమైన తుపాన్లు ఢీకొంటాయి నన్ను
నా సారాన్నంతా పీల్చి పిప్పి చేస్తారు
దానిని పట్టించుకోను
మృత్యువు తప్ప ప్రతిదీ వచ్చి నన్ను
కార్యక్షేత్రంలో దింపుతుంది
నన్ను కొల్లగొడుతుంది–దీనిని మరిచిపోతుంటాను
ఒక్కోసారి నేను గర్జిస్తాను–జూలు విదిలిస్తాను
చరిత్రలో గుర్తుండిపోయేలా
ఎర్రని రక్తపు బొట్లని చిందిస్తాను
ఆ తర్వాత అదీ మరచిపోతాను
నేను ప్రజా రాశిని!
అన్నీ జ్ఞాపకం వుంచుకోవడం నేర్చిన తర్వాత
నిన్నటి పాఠాలను మననం చేసుకుంటా
నిరుడు నన్ను దోచిన వారిని ఏమాత్రం మరవను
నన్నొక దద్దమ్మగా తలచిన వారిని అసలు మరవను
అపుడు
హేళనగా, ఎగతాళిగా "ప్రజలు" అని
అపహాస్యం చేసేవాడే వుండడు ఈ లోకంలో
అపుడు
వస్తారు ముందుకు
మీరనే 'మందలు', 'గుంపులు'
ప్రజారాశులు

(కార్ల్ శాండ్ బర్గ్(1878–1967) ప్రఖ్యాత అమెరికన్ కవి, రచయిత. కార్మికవర్గ కుటుంబ వాతావరణంలో పెరిగిన శాండ్‌బర్గ్ చిన్నవయసునుండే శ్రామికుడిగా వివిధ వృత్తులు చేపట్టాడు. ఈ పనుల్లో, పనులకోసం ప్రయాణాల్లో అతను ఎన్నో విషయాలు నేర్చుకున్నారు. జానపదుల జీవితాలను దగ్గరగా పరిశీలించారు. పేద – ధనిక అంతరాల్ని అతను దగ్గరగా గమనించాడు. సామ్యవాద భావాలతో ఉత్తేజితుడయ్యారు. పౌర హక్కుల ఉద్యమానికి సహకరించారు.)